క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని చెప్పారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు చెప్పారు. అయినప్పటికీ వ్యాపారస్తులు వాటిని విక్రయించినట్లయితే జరిమానా విధించడంతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. పలుమార్లు పట్టుబడినట్లయితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై చేపట్టిన ఉక్కు యాత్రలో భాగంగా పట్టణంలో ఆదివారం రాత్రి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కని తెలిపారు. అటువంటి ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు చేపడుతున్న ఉద్యమానికి ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు బంగారమ్మపేటలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వేణు, ఎన్‌వై నాయుడు, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి మందిరంలో ఆదివారం దేవీ సహిత సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి తదితర పూజలు నిర్వహించారు. బాబాకు విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎస్ శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు సత్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో జైగురుదత్త హోమాలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

కొమరాడ: విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ సేవే..మాధవ సేవ అని, చదువుతో పాటు సామాజిక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కృషిచేయాలని సూచించారు.

నేత్ర వైద్య శిబిరం

రాజాం: స్థానిక పట్టణంలోని కంచరవీధి సత్య సాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ అధికారి సురేష్ శిబిరానికి వచ్చిన వారికి నేత్రవైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. నేత్ర శస్త్రచికిత్స అవసరమైన వారికి ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో మందిర కన్వీనర్ బసవరాజు, సత్యసాయి జోనల్ కన్వీనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిల ప్రారంభం



తాగునీటి కుళాయిలు ప్రారంభిస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

మెంటాడ: మండలంలోని చింతలవలస గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను సర్పంచ్ కలిశెట్టి సూర్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీరు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ ఇంటికి కుళాయి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సద్గుణాలు అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ సద్గుణాలు అలవర్చుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. ఆదివారం మండలంలోని దేవుదళ గ్రామ గీతాశ్రమంలో జరిగిన సత్సంగ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా తోటివారిని గౌరవించడం నేర్చుకోవాలని, ఇతరులతో స్నేహభావంతో మెలగాలన్నారు.

భారీగా అన్నసమారాధన



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: పురపాలక సంఘం పరిధిలోని ఎస్ఎన్‌పీ కాలనీ, తూర్పు వీధిలో కొలువైన శ్రీ వర సిద్ధి వినాయక ఆలయం ప్రాంగణంలో స్థానిక వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కోరాడ శ్రీనివాసరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వినాయక మంటపం వద్ద ఆదివారం భారీగా అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రెడ్డి రామారావు, కోరాడ చిట్టి, సారికి కృష్ణంనాయుడు, ఎస్.చంద్ర, గృహ సారథులు, కార్యకర్తలు, వివిధ వార్డుల భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మండలంలో..

వినాయక ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బాలగుడబ, ములగ, సంగంవలస, నర్సిపురం, ఎమ్మార్‌నగరం తదితర గ్రామాల్లో అన్న సమారాధన నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కొన్ని చోట్ల వినాయక భక్తి శ్రద్ధలతో లక్ష పత్రిపూజ, కుంకుమపూజలను చేశారు.



కూరాకుల వీధిలో ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు

పంట వివరాలను ఈ క్రాప్ చేయించుకోవాలి



వెంగాపురంలో బయోమెట్రిక్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: రైతులు పండిస్తున్న పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని ఏఓ శ్రావణ్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని వెంగాపురం, పలగర గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు, బయోమెట్రిక్‌ను ఆయన ఆదివారం పరిశీలించారు. రైతులు సాగుచేస్తున్న పంట వివరాలను ఆర్బీకే వద్ద వీఏఏలకు తెలియచేసి, ఆ వివరాలతో నేరుగా పంట వద్దకు వెళ్లి ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఏ రెవెన్యూ గ్రామ పరిధిలో భూమి ఉంటుందో వీఏఏలకు తెలియచేయాలని కోరారు. సెప్టెంబరు, 30వ తేదీ లోపల పూర్తిచేసుకోవాలన్నారు. పంట రకం, విత్తిన తేదీ, నీటి పారుదల సౌకర్యాలు, తదితర అంశాలు నమోదు చేస్తారని వివరించారు. పంట నమోదైన తరువాత ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ క్రాప్ ఆధారంగా పంట విక్రయించుకునే అవకాశం, ఇన్సూరెన్స్, సున్నావడ్డీ రాయితీ, ప్రభుత్వ పథకాలు అమలవుతాయని పేర్కొన్నారు. పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అక్టోబరు 4న ధర్నా

బాడంగి: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కార మే లక్ష్యంగా అక్టోబరు 4వ తేదీన గ్రామీణ డాక్ సేవక్(గ్రామీణ తపాలా ఉద్యోగి)లు ధర్నా చేపడుతున్నట్లు ఏఐజీడీఎస్‌యూ ప్రత్యేక ఆహ్వానితురాలు ఆర్.హేమలత తెలిపారు. ఆదివారం స్థానిక పట్టణంలోని బ్రాంచి పోస్టాఫీస్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవక్‌లను రెగ్యులర్ చేస్తూ వారి పనివేళలు 8 గంటలు చేయాలని, సీనియర్ జీడీఎస్‌లకు 12, 24, 36 ఏళ్ల సర్వీసుల ఆధారంగా అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, అలాగే రూ.5 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, వైద్య సదుపాయాలు అందజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి నాలుగంచెల పోరాటానికి ఉద్యోగులు సిద్ధమయ్యారని, ఇప్పటికే రెండు పోరాటాలు పూర్తయ్యాయని, ప్రస్తుతం చేయబోయేది మూడో పోరాటమన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి



బహుమతులు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

రాజాం సిటీ: మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో చేపట్టిన నియోజకవర్గ స్థాయి పద్య పఠన పోటీలను ఆయన ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నీతిపద్యాలు కంఠస్తం చేసి, నేర్చుకోవడం, వాటిలోని నీతిని గ్రహించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తయారు కావచ్చన్నారు. ఇదిలా ఉండగా, 3 నుంచి 7వ తరగతి వరకు జూనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి లెంక పూజిత(ఎంపీపీఎస్, నక్కపేట) ప్రథమ, మక్క రోహిత్ (ఎంపీయూపీఎస్, పెంట) ద్వితీయ, ఎం.పద్మజ (ఎంపీయూపీఎస్, పెనుబాక) తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. సీనియర్స్ విభాగంలో పాగిరి శ్రావణి(ఎంపీయూపీఎస్, పెంట) ప్రథమ, డోకి గౌరి(ఎంపీపీఎస్ అంతకాపల్లి) ద్వితీయ, రెడ్డి లహరి(జెడ్పీహెచ్ఎస్ డోలపేట) తృతీయ బహుమతులు పొందారు. అలాగే ప్రైవేటు పాఠశాలల నుంచి జూనియర్స్ విభాగంలో రౌతు గ్రీష్మ, పాడి సాయికీర్తన, బింగి సోనాలిక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. సీనియర్స్ విభాగంలో టంకాల శృతి, టంకాల పూజిత, వారాడ గీతాశ్రీ తొలి మూడు స్థానాల్లో నిలిచి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీటీవీ రమణమూర్తి, గారపాటి శ్రీనివాసరావు, అమనాన నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పాలకొండ రూరల్: గ్రంథాలయంలో పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలను యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ శాఖా గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ బధిరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైకల్యాన్ని అధిగమించి విజయాలను సొంతం చేసుకున్న పలువురి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని జీవిత లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.షణ్ముఖరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

– **గరుగుబిల్లి:** మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు ఎస్.మధుసూదనరావు విద్యార్థులతో పలువురు సంఘ సంస్కర్తల జీవిత చరిత్ర పుస్తకాలను చదివించారు. అనంతరం చదరంగం, క్యారమ్స్, తదితర ఆటలు ఆడించారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: ప్రాథమిక స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, ఇది వారికి ఎంతో మేలు చేస్తుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అనంతరం లైబ్రేరియన్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మంచి విజ్ఞానం కలుగుతుందని, పుస్తకాలు చదివితే ఎన్నో విషయాలు తెలుస్తాయన్నారు. పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పడం, రాయడం నేర్చుకోవాలన్నారు. అలాగే చిత్రలేఖనంపై ప్రతీ విద్యార్థి దృష్టి సారించాలన్నారు.

చురుగ్గా ఆరోగ్య సర్వే



భామిని: పెద్దదిమిలిలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

భామిని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇంటింటి ఆరోగ్య సర్వే గ్రామాల్లో చురుగ్గా కొనసాగుతోంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నారు. భామిని మండలం చిన్నదిమిలి, కోసలి, పెద్దదిమిలిలో బాలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీపికారాణి ఆధ్వర్యంలో పీహెచ్ఎన్ దుర్గాంబ, ఎంపీహెచ్ఈఓ పద్మరాజు, ఆరోగ్య సిబ్బంది ఆదివారం సర్వే చేపట్టారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.



భామిని: చిన్నదిమిలిలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

● **పాలకొండ:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ కోరారు. మండలంలోని వైద్య సిబ్బందితో ఆదివారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి గ్రామాల వారీగా వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉందన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. వైద్య శిబిరం నిర్వహించే నాటికి గ్రామంలో సర్వే పూర్తిచేసి రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు.

ఆధ్యాత్మిక మార్గమే జీవనమార్గం కావాలి



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న పి.శ్రీదేవి

పార్వతీపురం టౌన్: ఆధ్యాత్మిక మార్గమే మనందరి జీవనమార్గం కావాలని మూడు జిల్లాల వాసవీక్లబ్ ఆధ్యాత్మిక ప్రచారకురాలు పి.శ్రీదేవి అన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్ వీధిలో గల వాసవీ కల్యాణ వేదిక వద్ద వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వాసవీ మాత చరిత్ర, నేటి సమాజంలో మానవ సంబధాలపై అవగాహన కార్యాక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైశ్యులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ వాసవీమాత అన్నారు. నిరంతరం అమ్మవారిని పూజించడం ద్వారా సకల సుఖాలు కలుగుతాయని చెప్పారు. భక్తిభావంతో నిరంతరం జీవించడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే నేటి సమాజంలో మానవ సంబంధాలు కృత్రిమంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడంతో మానవ సంబంధాలకు విఘాతం కలుగుతోందని, అందుకే సంఘ సభ్యులు కుటుంబ సంబంధాలపై మంచి అభిప్రాయాలను కలిగి ఉండాలని హితవు పలికారు. ఆధ్యాత్మిక భావనతో పాటు మానవత్వం, సేవా దృక్పథాన్ని సంఘ సభ్యులు అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్రీ వాసవీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజేష్, వి.మల్లిక్లతో పాటు ఉపాధ్యక్షుడు వరదా భాస్కర్‌లు ఆమెను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి పి.సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రి అభివృద్ధి



ఆయుర్వేద ఆస్పత్రిలో జరుగుతున్న పనులు

సీతానగరం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి, రోగులు సేద తీరే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేయడంతో ఆస్పత్రి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బూర్జ ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్ తెర్లి హేమాక్షి అన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఆస్పత్రిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రూ. 3.5 లక్షలు నిధులు విడుదల చేయడంతో ముందుగా ప్రహరీ మరమ్మతులు చేసినట్లు తెలియజేశారు. ప్రాంగణంలో యోగావిద్య బోధించడానికి అనుకూల వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు. అలాగే దీర్ఘకాల రోగులకు రోగనివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని, క్రమేపీ ప్రజలు ఆయుర్వేద వైద్యం పట్ల దృష్టి సారిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామాల్లో ఉచితవైద్య శిబిరాలు నిర్వహించి వైద్యసేవలు అందిస్తున్నామని తెలియజేశారు.

జీవామృతం రైతుకు శ్రేయస్కరం



ద్రవజీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: మండలంలో ఖరీఫ్ వరిసాగు చేస్తున్న రైతులు తెగుళ్ల నివారణకు అవసరమైన ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పించుకోవాలి. భవిష్యత్‌లో జీవామృతంతో పండించిన పంటలు శ్రేయస్కరమని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. ఈ మేరకు వెంకటాపురంలో ఆదివారం నిర్వహించిన డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. భూమి సారవంతం అవడానికి, తెగుళ్ల నివారణకు అవసరమైన ద్రవ జీవామృతాన్ని తయారు చేసేందుకు ముడి సరుకులన్నీ రైతులకు అందుబాటులో ఉండేవేనని స్పష్టం చేశారు. ద్రవ జీవామృతం తయారీకి 200 లీటర్లనీటిలో 2 కేజీల బెల్లం, 2 కేజీల పప్పు దినుసులపిండి, 10 కేజీల పేడ, గోవు మూత్రం 10లీటర్లు, పుట్టమట్టి 1 కేజీ వేసి 48 గంటలు నిల్వ చేసుకోవాలని చెప్పారు. తర్వాత వరి పొలానికి పారే నీటిలో పిచికారీ చేయాలని సూచించారు. దీనివల్ల భూమి సారవంతం అవడంతో పాటు తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శిక్షణ పొందుతున్న రైతులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ర్యాలీ



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కురుపాం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కురుపాం నియోజకవర్గంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, మండంగి రమణ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు, ఉపాధి కల్పించిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వమే వాటిని ఒక్కొక్కటిగా ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 29న విశాఖలో నిర్వహించే భహిరంగ సభలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ కార్యవర్గ సభ్యులు జగన్, స్టీల్‌ప్లాంట్ జనరల్ సెక్రటరీ కె.ఎం.శ్రీనివాస్, సీపీఎం నాయకులు కోలక అవినాష్, మండంగి శ్రీనివాసరావు, కొల్లి గంగునాయుడు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదమేరంగిలో రాష్ట్రస్థాయి నాటక పోటీలు



మాట్లాడుతున్న మేరంగి నాటక పరిషత్ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న సత్యకైలాస్ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 30, వచ్చే నెల 1,2 తేదీల్లో రాష్ట్ర స్థాయి నాటక పోటీలు నిర్వహించనున్నట్లు మేరంగి నాటక పరిషత్ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు తెలిపారు. సత్యకైలాస్ పాఠశాలలో ఆదివారం నాటక కమిటీ సమావేశం నిర్వహించారు. అంతరించిపోతున్న కళలను కాపాడుకునేందుకు, కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కళాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మేరంగి నాటక పరిషత్ ప్రధాన కార్యదర్శి రౌతు విజయకుమార్, సహాధ్యక్షుడు వాన నారాయణరావు, ఉపాధ్యక్షుడు బలగ వెంకటరమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మరడాన కిశోర్, కార్యదర్శి రౌతు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

బొబ్బిలి: రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు తోడ్పడాలని ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ అన్నారు. స్థానిక పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నియమాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డుకు కుడివైపునే నడవాలని, జీబ్రాక్రాసింగ్ వద్దనే రోడ్డును దాటాలని పాదచారులకు తెలిపారు. వాహనదారులు ఎడమవైపున నడపాలని, వాహనాలను ఓవర్‌టేక్ చేసేటప్పుడు కుడివైపు నుంచి చేయాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని, రోడ్డు మలుపు చిహ్నాలు చూసి, వాహనాలు జాగ్రత్తగా నడపాలని తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించవద్దని, అధిక లోడుతో వాహనాలు నడపవద్దన్నారు.

'చదవడం మాకిష్టం'

బాడంగి: స్థానిక శాఖ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు వారికి ఇష్టమైన పుస్తకాలు అందజేసి, వారితో చదివించారు. అలాగే నీతికథలు, నీతిపద్యాలు తెలిపి, వాటిలోని నీతిని వివరించారు.